ప్రజాశక్తి

శుక్రవారం 28 నవంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





ఆద్యంతం.. అదిరింది !



డ్యాన్సులతో అదరగొట్టిన విద్యార్థులు

- సందడి నింపిన ఎస్‌ఎఫ్‌ఐ కల్చరల్ ఫెస్ట్
- డ్యాన్సులతో హుషారెక్కించిన విద్యార్థులు
- పోరాటాల ఆవశ్యకతను తెలియజేసిన అతిథులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : **ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఆంధ్రా యూనివర్శిటీలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో మూడు రోజులపాటు తలపెట్టిన కల్చరల్ ఫెస్ట్ చివరి రోజైన గురువారమూ అందరిలో సందడి నింపింది. సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు అదరగొట్టారు. సినిమా పాటలకు హుషారెక్కించే స్టెప్పులు వేశారు. జానపద గీతాలకు, వెస్టన్ సాంగ్స్‌కు అనుగుణంగా నర్తించారు. వెరసి ఈ ఫెస్ట్ విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.**

గురువారం ఈ ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషీ గోష్, మాజీ నాయకులు,



హాజరైన విద్యార్థులు

సిహెచ్.నర్సింగరావు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్‌జె.నాయుడు హాజరై

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు విద్యా రంగంలో మాత్రమే కాకుండా సాంస్కృతిక రంగంలోనూ ప్రతిభ చూపించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి సంవత్సరం నిర్వహించాలని ఆకాంక్షించారు. అవి విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. సిహెచ్.నర్సింగరావు తమ కాలంలో చేసిన పోరాటాలను, మిగతా 2లో..



విద్యార్థులను అభినందిస్తున్న ఐషీ గోష్, సిహెచ్.నర్సింగరావు

బిఎల్‌ఒలకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల ఆదేశాల మేరకు చేపట్టే అన్ని రకాల ప్రక్రియలు, అంశాలపై బిఎల్‌ఒలు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, ఆ మేరకు ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు క్రమం తప్పకుండా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి భాగస్వామ్యమైన కలెక్టర్ విశాఖ జిల్లాకు సంబంధించిన అన్ని అంశాలను వెల్లడించారు. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియలు, ఇతర అంశాలపై నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అధికారులకు శిక్షణ సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తాజాగా ఈ నెల 25న బిఎల్‌ఒలకు శిక్షణ అందించామన్నారు. ఎప్పుడొచ్చిన దరఖాస్తులను అప్పుడే పరిశీలించి తగిన చర్యలు చేపడుతున్నామని, పెండింగ్ లేకుండా చూసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో ఒక ఇఆర్‌ఒ, ఒక ఎఇఆర్‌ఒ స్థానాలను భర్తీ చేయాల్సి ఉందని సిఇఒ దృష్టికి తీసుకెళ్లారు. విసి అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైన కలెక్టర్ పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. రాబోయే అవసరాలను, జాబితా సవరణ, మ్యాపింగ్ ప్రక్రియలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే అందరూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు.

మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షాత్తూ అధికార పార్టీ నేతలపై, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, టిడిపి అంటే తెలుగు దండుపాళ్యం పార్టీగా మారిందని ఆమె మండిపడ్డారు. విశాఖలోని వైసిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళా సంక్షేమ శాఖ మంత్రి పీఏ ఏకంగా ప్రభుత్వ మహిళా ఉద్యోగిని వేధిస్తే పోలీసులుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు సరికదా న్యాయం చేయాలని మంత్రిని ఆశ్రయిస్తే బదిలీ బహుమానంగా ఇవ్వడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. కూటమి పాలనలో ఆంధ్రప్రదేశ్ శాంతిభద్రతల నిర్వహణలో 36వ స్థానానికి దిగజారిందని విమర్శించారు.

ఎసిబికి చిక్కిన విఆర్‌ఒ

▶ వార్త 5లో..

బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి

▶ వార్త 2లో..

ఆదర్శ వైద్యుడు డాక్టర్ పి.రామారావు

▶ వార్త 2లో..



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామస్వామి

ఉత్పత్తితో వేతనాలను ముడిపెట్టొద్దు

- చట్ట విరుద్ధ సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఉక్కు కార్మికుల ధర్నా

వార్త మెయిన్‌లో..

ప్రత్యేక అవసరాల పిల్లల దత్తతను ప్రోత్సహించండి

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ మాలిక్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ప్రత్యేక అవసరాల పిల్లల దత్తతను ప్రోత్సహించాలని కేంద్ర మహిళా. శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ మాలిక్ అన్నారు. 'ప్రత్యేక అవసరాల పిల్లల సంస్థాగతేతర పునరావాసం' అన్న అంశంపై సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కార), మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విశాఖలో గురువారం జాతీయ దత్తత అవగాహన సదస్సు - 2025 జరిగింది. నవంబర్ నెలలో జరిగే జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ సదస్సులో పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు శాశ్వత, ప్రేమతో కూడిన కుటుంబ ఆధారిత సంరక్షణ అందించడానికి వారి దత్తతను ప్రోత్సహించాలని వారంతా అభిప్రాయపడ్డారు. ముఖ్య అతిథి అనిల్ మాలిక్ మాట్లాడుతూ ప్రతి బిడ్డకు, ముఖ్యంగా ప్రత్యేక అవసరాలున్న వారికి సురక్షితమైన, శాశ్వత కుటుంబ వాతావరణం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. జువైనల్ జస్టిస్ చట్టం, దత్తత నిబంధనలకు అనుగుణంగా దత్తత సేవలను మెరుగుపరచడానికి రాష్ట్రాలు, ఏజెన్సీలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు



ప్రత్యేక అవసరాల పిల్లలను దత్తత తీసుకున్న వారితో అనిల్ మాలిక్

.అనంతరం కార సభ్య కార్యదర్శి, సిఇఒ భావనా సక్సేనా మాట్లాడుతూ నైతిక, సమగ్ర, శిశు కేంద్రీకృత దత్తత వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కార చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సకాలంలో, పారదర్శక దత్తత ప్రక్రియల కోసం రాష్ట్ర దత్తత వనరుల సంస్థలు, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు, బాలల సంక్షేమ కమిటీల మధ్య మరింత సమన్వయం ఉండాలని తెలిపారు. కార డైరెక్టర్ పుష్ప రావత్ పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దత్తత తీసుకున్న తల్లిదండ్రుల అనుభవాల కలబోత

సదస్సులో పాల్గొన్న వారు ప్రత్యేక అవసరాల పిల్లల దత్తత విషయంలో తమ అనుభవాలను పంచుకున్నారు. పలువురికి వారి మాటలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆద్యంతం.. అదిరింది !

నాటి సంగతులను విద్యార్థులతో పంచుకున్నారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలతో పాటు విద్యార్థులను చైతన్యవంతంగా, సృజనాత్మకంగా సమాజంలో నడుచుకునే విధంగా అనేకనేక సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి స్తోందన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల కాలంలో ఎస్ఎఫ్ఐ మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహించి విద్యార్థుల పక్షాన నిలబడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.అజయ్, డి.వెంకటరమణ, యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.హర్షిత్, ఎం.కుసుమాంజలి, నాయకులు సంజయ్, తరుణ్, సోమేశ్, ప్రగతి, నిఖిల్, మానస, సునీల్, సతీష్ పాల్గొన్నారు. ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులందరికీ ఎస్ఎఫ్ఐ ధన్యవాదాలు తెలియజేసింది.

దత్తతను ప్రోత్సహించండి

స్ఫూర్తినిచ్చాయి. సదస్సులో పాల్గొన్న 400 మందికిపైగా విధాన నిర్ణేతలు, నిపుణులు, దత్తత తీసుకున్న తల్లిదండ్రులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పిల్లల దత్తత ప్రక్రియను బలోపేతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ, ఒడిశా, ఉత్తరాఖండ్, చండీగఢ్ రాష్ట్రాల ప్రతినిధులు వైద్య పరీక్షలు, ఆర్థిక సహాయ వ్యవస్థలు, పిల్లలను ముందస్తుగా గుర్తించడం, చట్టపరమైన సౌలభ్యం కల్పించడం వంటి అంశాలపై ఉత్తమ పద్ధతులను పంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా 'ప్రత్యేక అవసరాలున్న పిల్లల దత్తత' లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ చిత్రం సామాజిక అపోహలను తొలగించి, దత్తతను ప్రోత్సహిస్తుందని అధికారులు తెలిపారు



రామారావు సంస్మరణ సభలో పాల్గొన్న ప్రముఖులు

ఆదర్శ వైద్యుడు డాక్టర్ పి.రామారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆదర్శ వైద్యుడు డాక్టర్ పెంటకోట రామారావు అని పలువురు వక్తలు కొనియాడారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం హెల్త్ వింగ్, ప్రజా ఆరోగ్య వేదిక సంయుక్తంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రిటైర్డ్ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రామారావు సంస్మరణ సభను నిర్వహించాయి. ప్రభుత్వ వైద్యుడిగా, ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా అధికారిగా, కెజిహెచ్‌లో బ్లడ్ బ్యాంక్ అధికారిగా, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిగా దశాబ్దాల పాటు నిజాయితీ, క్రమశిక్షణతో సేవలందించిన వ్యక్తి డాక్టర్ రామారావు అని కొనియాడారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా సామాజిక సేవకు నిబద్ధతతో పని చేశారని సభలో పాల్గొన్న అతిథులు కొనియాడారు. విశాఖ వినియోగదారుల ఫోరం కార్యదర్శిగా, ప్రజా ఆరోగ్య వేదిక గౌరవాధ్యక్షుడిగా, ప్రజారోగ్యం, వినియోగదారుల హక్కుల కోసం ఆయన అవిశ్రాంత కృషి చేశారన్నారు. 70 ఏళ్ల వయసులోనూ రోడ్లు లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు గుర్రంపై ప్రయాణించి, కొండల్లోని వైద్య శిబిరాల్లో పాల్గొని, గిరిజన ప్రజలకు ఆరోగ్య సేవలందించారని గుర్తు చేశారు. ఆయన సేవా స్ఫూర్తి అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన మరణం ప్రజలు, వినియోగదారులు, అణగారిన వర్గాలలో కోలుకోలేని శూన్యతను మిగిల్చిందన్నారు. ఆయన ఆదర్శాలను భవిష్యత్ తరాలకు తీసుకెళ్లడమే మనం ఆయనకు అర్పించగల నిజమైన నివాళి అని తెలిపారు. ప్రజా ఆరోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య విభాగ కన్వీనర్ టి.కామేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సభలో నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.బాలమోహన్ దాసు, అల్లూరి విజ్ఞాన కేంద్రం చైర్మన్ విఎస్.పద్మనాభ రాజు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ మురళీమోహన్, కార్యదర్శి డాక్టర్ వైఎల్.నరసింగరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆఫ్ గైనకాలజీ డాక్టర్ పిజె.శ్రీనివాస్, డాక్టర్ పానకాలరావు, డాక్టర్ జగదీష్ ,డాక్టర్ రాంప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రజా ఆరోగ్య వేదిక, విశాఖ వినియోగదారుల ఫోరం సభ్యులు, గిరిజన సంఘ నాయకులు, అల్లూరి విజ్ఞాన కేంద్రం సభ్యులు, డాక్టర్ రామారావు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ కేంద్రం వద్ద భక్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరం బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలలో భాగంగా తొలి గురువారం వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా పాత నగరంలో నూతనంగా ఏర్పాటైన కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు టౌన్ కొత్త రోడ్డు శాఖ ఆధ్వర్యంలో భక్తులకు గురువారం ఉదయం నుంచి మజ్జిగ పంపిణీ చేశారు. అదే సమయంలో చుట్టుపక్కల ప్రాంతాలలో ఉండే వ్యాపారుల కోసం చిల్లర నాణేల పంపిణీ జరిగింది. రూ.5, రూ.10, రూ.20 నాణేలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజరు కె.విశ్వనాథం, డిప్యూటీ మేనేజరు జె.శంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలి



విశాఖ నగరంలో సాగుతున్న ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపిలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై హైకోర్టు సుమోటోగా న్యాయవిచారణ చేపట్టాలని సిపిఐ జాతీయ సభ్యులు జెవి.సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ హత్యలు ప్రజా తిరుగుబాట్లను ఆపలేవని చరిత్ర రుజువు చేస్తోందన్నారు. ఎపిలో జరిగిన ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం విశాఖ నగరంలోని సరస్వతి పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, తెలుగు రాష్ట్రాలలో జల్, జంగిల్, జమీన్ కోసం ఉద్యమిస్తున్న ఆదివాసీలను, వారికి అండగా నిలబడిన మావోయిస్టులను రాజ్యాంగానికి, ఉనికిలో ఉన్న క్రిమినల్ చట్టాలకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపుతున్నాయన్నారు. అడవుల్లోని సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబడ్డానికి రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లకు, పీసా చట్టానికి, అటవీ హక్కుల చట్టానికి, పర్యావరణ చట్టాలకు వ్యతిరేకంగా వందకు పైగా ఒప్పందాలు కుదుర్చుకున్నాయన్నారు. సదరు ఒప్పందాల అమలుకు ఆటంకంగా ఉన్నారని ఆదివాసీలను, మావోయిస్టులను చట్ట విరుద్ధంగా చంపుతున్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా సహా పలువురిని ఇటీవల పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపారన్నారు. ఇవి రాజ్యాంగ వ్యతిరేక రాజ్య హత్యలుగా జరిగాయని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌కు అర్బన్ ప్రాంతాల్లో ఆపరేషన్ సంభవ్‌గా మరో పేరు పెట్టి మరో 50 మందికి పైబడి వ్యక్తులను నిర్బంధించి రాష్ట్రంలోని విజయవాడ, ఏలూరు, కాకినాడ తదితర ప్రాంతాల్లో అరెస్టులు చేసి ప్రజాందోళన మేరకు కోర్టులో ప్రవేశపెట్టి జైలుకు పంపించారన్నారు. పౌర సమాజం మౌనం వీడి ప్రభుత్వం సాగిస్తున్న ఈ ప్రజా వ్యతిరేక అభివృద్ధి నమూనాను వ్యతిరేకిస్తూ జరిగేటువంటి ప్రజా ఆందోళనలో పాల్గొనాలని, రాజ్యం ప్రజలపై అమలు చేస్తున్న రాజ్య హింసకు వ్యతిరేకంగా కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల కార్యకర్తలు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు అందరినీ ఉద్వేగానికి గురిచేశాయి. కంటతడి పెట్టించాయి. ఉత్తేజాన్నిచ్చాయి. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వై కొండయ్య, వామపక్ష పార్టీలు, వాటి అనుబంధ సంఘాల నాయకులు గోవిందరాజులు, పట్నాయక్, ఎం.లక్ష్మి, టి.శ్రీరామమూర్తి, మహిత, న్యాయవాదులు కె.పద్మ, పల్లేటి అప్పారావు, చలం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పనే తమ ప్రథమ కర్తవ్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. గురువారం నాలుగో జోన్ 37వ వార్డు పరిధిలోని జబ్బర్ తోటలో సుమారు రూ.42 లక్షల జివిఎంసి నిధులతో నిర్మించిన సామాజిక భవనం రెండో అంతస్తును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అమలవుతున్నాయన్నారు. జబ్బర్‌తోటలోని ప్రజల అవసరాల మేరకు సామాజిక భవనానికి అదనపు అంతస్తు నిర్మించి ప్రారంభించామన్నారు.కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, జివిఎంసి ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వెంకటేశ్వరరావు, సహాయక ఇంజినీరు, సచివాలయం కార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో రూ.1.12 కోట్ల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో అక్టోబర్ నెల రికవరీ మేళాను గురువారం మధ్యాహ్నం సిపి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ గత నెలలో 83 కేసులు నమోదయ్యాయని, 58 కేసులను విజయవంతంగా ఛేదించామని, 77 మందిని అరెస్టు చేశామని చెప్పారు. చోరీ కాబడిన సొత్తులో రూ.37,03,480 విలువగల వస్తువులతోపాటు రూ. 75 లక్షల విలువగల 500 మొబైల్ ఫోన్‌లను కలుపుకుని మొత్తం రూ. 1,12,03,480 విలువగల సొత్తును రికవరీ చేశామన్నారు. ఈ మేళా ద్వారా ఆ సొత్తును బాధితులకు అందజేస్తామన్నారు.

మహారాజశ్రీ నర్సీపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS.182/2022

కుందేటి గంగయ్యమ్మ ...వాది
కుందేటి వెంకటరమణ మరియు 4 మంది
...ప్రతివాదులు

సమన్లు

టు
1. D4 కుందేటి అచ్చియ్యనాయుడు
S/o late స్వామి నాయుడు వయస్సు-45 సం॥ వ్యవసాయం గుమ్మిడిగొండ గ్రామం, నాతవరం మండలం, అనకాపల్లి జిల్లా.
2. D5 కుందేటి త్రినాథ్ S/o late స్వామి నాయుడు వయస్సు-40 సం॥ ఉద్యోగం గుమ్మిడిగొండ గ్రామం, నాతవరం మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు దావాలో వాది గారు ప్రతివాదులైన D4 మరియు D5 లైన D4 కుందేటి అచ్చియ్యనాయుడు, D5 కుందేటి త్రినాథ్‌లైన మీపై పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు కాగ మీకు కోర్టుద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా ఎన్ని సార్లు సమన్లు పంపినను మీరు అందుకోకుండా కాలయాపన చేస్తున్నారు అందుపై శ్రీకోర్టు వారు మీ హాజరు నిమత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డరు చేసినారు కనుక మీరు **తేది. 03-12-2025న సమయం ఉదయం 10-30 ని॥లకు** పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ వాదనలు తెలియపరచవలెను లేని యెడల దావాను మీ పరోక్షమందు తీర్మానించడమగునని మీకు ఇందు మూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
లోకా లోవరాజు
వాది తరుపు న్యాయవాది
సెల్ : 8008538743
నర్సీపట్నం
తేది.27-11-2025

మహారాజశ్రీ విశాఖపట్నం ఫ్యామిలీ జడ్జి కమ్ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
F.C.O.P. 554/2025

బిట్వీన్
సిద్ధ సీతారామ్ @ శామ్యూల్ ...పిటీషనర్
అండ్
సిద్ధ రత్నకుమారి @ కత్తిరిచిట్టి రత్నకుమారి
...రెస్పాండెంట్

నోటీసు

టు
రెస్పాండెంటు:
సిద్ధ రత్నకుమారి @ కత్తిరిచిట్టి రత్నకుమారి
W/o. సిద్ధ సీతారామ్ @ శామ్యూల్,
డోర్ నెం. 16-688, బ్లాక్-8, యస్-5,
JNNURM హౌసింగ్ కాలనీ, శ్రీకాంత్ నగర్,
ఆరిలోవ కాలనీ, విశాఖపట్నం-530040

పైనెంబరు పిటీషన్‌లో పిటీషనర్ మీ పైన విడాకుల చట్టంలోని సెక్షన్ 32 ప్రకారం కాపురము పిటీషనర్‌తో చేయు నిమిత్తము శ్రీ కోర్టు వారి యెదుట వ్యాజ్యము దఖలు పరచ డము జరిగినది. సదరు వ్యాజ్యములో ఈ కోర్టులో మీ హాజరు నిమిత్తము **తేది. 16-12-2025** న **ఉ॥గం॥10.30ని॥**లకు మీరు స్వయంగా గానీ లేక వకీలు గారి ద్వారాగాని శ్రీకోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలను తెలియ జేయుటకు పై ఉదహరించిన దినమునందు మీరు హాజరు అగుటకు ఉత్తర్వు చేయడమైనది. మీరు హాజరు కానిపక్షమున మీ పరోక్షమందు వ్యాజ్యము తీర్మాణించుట జరుగును.

(By Order of the Hon'ble Court)
A. RAJ KUMAR, A. SUSHMITHA & K. PADMA, Advocates
Visakhapatnam. **Cell: 98483 39697**

IN THE HON'BLE COURT OF THE IInd ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P.No. 14/2025

Between:
Jalemu Rajendra Prasad
S/o. Narasimha Murthy, aged 60 yrs
Rest at D.No. 50-40-16/3, T.P.T.Colony
Visakhapatnam ... Petitioner
And:
1.Doddi Venkateswara Rao, S/o. Venkata Ramana, aged 59 yrs, D.No. 3-117/5, Karuna Abode, Daspalla Layout, Yendada, Visakhapatnam
2. Kondipilli Nagendra Kumar, S/o. Late Sanyasirao, aged 50 yrs D.No. 4-4-7/7, Pedawaltair, Visakhapatnam
3. Meka Kalidas, S/o. Purushottam, aged 62 yrs, Rest at D.No. 33-14-295/4, Allipuram Main Road, Visakhapatnam
4. Basana Venkata Pededa Appala Syam Kumar, Reptd by its GPA Holder Ammireddy Sarada Lakshmi, D/o. Basana Raju, aged 57 yrs, D.No. 50-2-8/1, Gandhi Nagar, Nakkavanipalem, Visakhapatnam.

GENERAL NOTICE

The public are hereby inform that the above petitioner filed above I.P. 14/25 on the file of II Addl. Senior Civil Judge, Visakhapatnam to declare them as on insolvent and the matter stands posted to **2-12-2025** for heraing. So public are hereby informed that any objection can be raised in the above case before the Hon'ble court on either in person or through on advocate at **10-30 A.M.**

(By Court Order)
G.T.V. MALLESWARA RAO
ADVOCATE, D.No. 26-1-91/B, 2nd Floor, Near Durgalamma Temple, Poorna Market Road, Visakhapatnam.
Visakhapatnam.
Dt. 26-11-2025
Cell : 9440110819

BEFORE THE HONOURABLE COURT OF THE II ADDI. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P.NO:17/2025

Between:
Narava Lakshmi, W/o Ramu, Hindu aged 54 years, House-wife, residing at D.No.1-25-1, Adarsha Nagar, Ushodaya Junction, Visakhapatnam-530017, Aadhar No.625138239861.
...Petitioner
And:
1. E.Rajeswari W/o ELVS Prakash, Chandrampalem, Madhuravada, Visakhapatnam-530041.
2. Dokala Satya Sri, Chandrampalem, rest do.
3. Golusupudi Beena Rani, Durga Nagar, Chandrampalem, rest do.
4. Pilla Uma, W/o Sanyasi Naidu, Durga Nagar, Chandrampalem, rest do..
5. Durga Sri Lakshmi, W/o late Rama Chandra Rao, Durga Nagar, rest do. **...Respondents**

GENERAL NOTICE

The public are hereby informed that the above petitioner filed the above I.P., to declare her as an insolvent and the matter stands posted to **5-12-2025** for hearing. So the public are hereby informed that anybody have any objections can be raised in the above case and appear before the above said Hon'ble Court on the said date either in person or through an Advocate at **10.30A.M.,**, as otherwise, the matter will be proceeded further.

PILLA RAMA RAO, Advocate
Visakhapatam-530040
Cell No.9398014737

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION –II AT: VISAKHAPATNAM
E.A. 73/2024 in C.C. 226/2022

Between:
Sri Vedula Narasimha Murthy
...D.Hr/Complainant
And:
Sri Talasu Vaikunta Rao & another
...J.Drs/Opposite Parties

NOTICE


To,
J.Dr/OP-1: Sri Talasu Vaikunta Rao, S/o. T. Sarveswar Rao, Proprietor of KDM Builders, Flat No.104, D.No.9-332/4, Sri Vaibhav Enclave, Narsimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
J.Dr/OP-2: KDM Builders, Rep. by its Proprietor Sri Talasu Vaikunta Rao, S/o. T. Sarveswar Rao, Flat No.104, D.No.9-332/4, Sri Vaibhav Enclave, Narsimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.

The above named complainant has filed E.A.73/2024 in C.C.226/2022 against the opposite parties to pay a sum of Rs.12,000/- per month from 12-05-2021 till obtaining NOC from GVMC, the opposite parties are further directed to pay an amount of Rs.1,00,000/- towards compensation for causing mental agony, Physical constraints and damages, to pay Rs.10,000/-towards costs of the complaint, time for compliance of this order is 45 days from the date of this order and you are shown as opposite party to the proceedings. Please take notice that the above matter is posted to **04-12-2025** for your appearance before the Hon'ble District Consumer Disputes Redressal Commission-II, VUDA Complex, Siripuram, Visakha patnam at **10.30 A.M.,** either yourself in person or by authorized person, failing which the Hon'ble Commission will be proceed with the matter as per law.

B. NARASINGA RAO, HABEEB SULTAN ALI, B.KAVITHA, P. HYMA & G. SYAMALA DEVI
Advocates, Visakhapatnam,
Cell : 9885355102.

ఆదాయం ఉన్నా అభివృద్ధి సున్నా...

ఇది గుడిలోవ రంగనాథ స్వామి దేవాలయ దుస్థితి



ప్రజాశక్తి -ఆనందపురం : పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి పొందిన గుడిలోవ రంగనాథస్వామి దేవాలయం అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉంది. ఏటా సుమారు రూ.16 లక్షల ఆదాయం వచ్చే ఈ దేవాలయం, గత 20 ఏళ్లుగా ఎటువంటి అభివృద్ధి పనులు లేకుండా ఉంది. కార్తీక మాసంలో ప్రతి సోమవారమూ సుమారు 4వేల మంది భక్తులు, ముఖ్యంగా మహిళలు దేవాలయాన్ని దర్శించేందుకు తరలివస్తున్నారు. మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలం, వెయిటింగ్ బెంచ్‌లు, దుస్తులు మార్చుకునే గదులు తదితర కనీస వసతులు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దేవస్థానానికి సుమారు 112 ఎకరాల భూములు ఉన్నాయి. వాటి ద్వారా సంవత్సరానికి రూ.16.5 లక్షల వరకు ఆదాయం వస్తున్నప్పటికీ, అభివృద్ధి పనుల కోసం వినియోగించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరా లేక అనేక పనులు నిలిచిపోయాయని ఉత్సవ కమిటీ సభ్యులు చెబుతున్నారు. ఈ సమస్యపై స్థానికులు, భక్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా, ఫలితం లేకపోయిందని అంటున్నారు. అధికారులు దృష్టి సారించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే, గుడిలోవ దేవాలయం ఉత్తరాంధ్రలో ఒక ప్రధాన ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గుడిలోవ రంగనాథస్వామి దేవాలయం ఎంతో పౌరాణిక ప్రాముఖ్యత కలిగిన పుణ్యక్షేత్రమని, దీనిని అభివృద్ధి పరిచి ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి గాంచిన ఆలయంగా తీర్చిదిద్దాలని జనసేన మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు, గుడిలోవ దేవస్థానం డైరెక్టర్ కోరాడ రమేష్, ధనియాల సూర్యనారాయణ తదితరులు కోరుతున్నారు.

ప్రకృతి రమణీయంగా...

ప్రకృతి రమణీయత, పురాణ ప్రాశస్త్యం కలబోతగా అలరారుతున్న గుడిలోవ రంగనాథస్వామి దేవాలయం పుణ్యక్షేత్రంగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నగరానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పుణ్యక్షేత్రం ప్రసిద్ధి చెందింది. నాలుగు కొండల నడుమ ఎత్తయిన ప్రదేశంలో ఏర్పడిన దేవాలయ సమూహం సందర్శకులను ఇట్టే ఆకర్షిస్తోంది. రెండు శతాబ్దాల క్రితం నిర్మితమైన ఇది బృహదాచల క్షేత్రంగా ప్రసిద్దికెక్కింది. ఇక్కడ రంగనాథస్వామి, నారాయణేశ్వర ఆలయాలు ఒకే ప్రాంగణంలో ఉండటం అరుదైన విశేషంగా చెబుతుంటారు. ఇచట దేవతలు సంచరించేవారని, ఋషులు తపమాచరించిన పుణ్యక్షేత్రమని పేరు ఉంది. ఇక్కడి గర్భగుడి నుంచి.. నిత్యధారయైన.. ఆకాశగంగతో స్నానమాచరిస్తే మానసిక, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల నమ్మకం.

దేవాలయాలకు తూర్పుభాగంలో ఏకశిలపై వెలసిన శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దేవాలయ కమిటీ ఐదేళ్ల క్రితం జరిపిన తవ్వకాల్లో దొరికిన శివలింగం, నంది విగ్రహాలు ఇక్కడ ప్రత్యేక పూజలు అందుకుంటున్నాయి. కార్తీక మాసంలో ఇక్కడకు అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. ప్రకృతి ఒడిలో కొండల నడుమ సుందరంగా వెలసిన ఈ దేవాలయం భక్తులు, పర్యాటకుల ఆకర్షణకు నిలయంగా ఉంది.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- గోపాలపట్నం : సింహచలం ఆర్‌టిసి డిపో సమీపంలో గురువారం తెల్లవారుజామున 5 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. బస్సు కింద పడిపోయాడా, బస్సు ఢీకొట్టి మృతిచెందాడా అన్న విషయం దర్యాప్తులో తేలనుందని సిఐ సన్యాసినాయుడు తెలిపారు. మృతుని ఎవరైనా గుర్తిస్తే గోపాలపట్నం సిఐ 9440796020, ఎస్ఐ 8331041648 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కొంగసింగి గ్రామంలో అరిట లక్ష్మీ పార్వతి(26) అనే వివాహిత బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై గొలుగొండ ఎస్సై పి..రామారావు అందించిన వివరాలివి. లక్ష్మీ పార్వతి భర్త రెండు నెలల క్రితం నేవీ ఉద్యోగిగా రిటైరయ్యారు. ఉద్యోగ విరమణ సమయంలో వచ్చిన సుమారు రూ.20లక్షల సొమ్ము బెట్టింగులు, ట్రేడింగ్ ద్వారా పోగొట్టుకున్నారు. దీనిపై భార్యభర్తల మధ్య వివాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో లక్ష్మీ పార్వతి బుధవారం సాయంత్రం కూడా వివాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మీపార్వతి బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని చనిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మద్యం మత్తులో ప్రాణహాని చేస్తానని బెదిరించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని కింతాడ గ్రామానికి చెందిన కింతాడ శ్రీను భార్య కాంతంపై అదే గ్రామానికి చెందిన సిరపరపు శివ స్వామి నాయుడు స్కూటీ తాళంతో ఎడమ చేతిపై కొట్టి గాయపర్చాడు. దీంతో కాంతం భర్త శ్రీను తన భార్యను తీసుకొని శివ స్వామినాయుడు ఇంటికి వెళ్లి అడగ్గా మద్యం మత్తులో ఉన్న శివ స్వామినాయుడు శ్రీనుపై అసభ్యంగా ప్రవర్తించి, ప్రాణహాని చేస్తానని బెదిరించాడు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా శివ స్వామినాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సదరు నిందితుడు గతంలో కూడా హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉండి, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. ఇకపై ఇటువంటి అగత్యాలకు పాల్పడినట్లయితే అతనిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

కాలువ పనుల పునరుద్ధరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు పరిధి ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా సిమెంట్ కాలువ పునరుద్ధరణ పనులు ఎట్టకేలకు గురువారం ప్రారంభమయ్యాయి. వర్షం కురిసిన ప్రతిసారీ ఈ పురాతన కాలువ ద్వారా మురుగు నీరు, వాడుక, వర్షం నీరు రోడ్డు మార్గంలో పొంగి స్థానికుల రాకపోకలకు అసౌకర్యంగా ఉండేది. స్థానికుల విజ్ఞప్తి మేరకు జివిఎంసి 1వ జోన్ ఇంజినీరింగ్ అధికారులు రూ.14 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేశారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.

మహిళా సమైక్య సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెంలో గురువారం మహిళా సమైక్య సభ్యులకు డిఆర్‌డిఎ ప్రాజెక్టు మేనేజర్ బి.వైదేహి ఆధ్వర్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా సంఘాల అభివృద్ధికి, ఆర్థికంగా బలపడడానికి ముందస్తు కార్యాచరణ ప్రణాళికను గ్రామ సంఘ సభ్యులతోనే నిర్వహించి, సంవత్సరానికి సరిపడే నిధులు, ఆరోగ్యం, విద్య తదితర ఎనిమిది రకాలపై కార్యచరణాన్ని తయారుచేస్తున్నట్లు వైదేహి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామీణ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 'మన డబ్బు మన లెక్కలు' కార్యక్రమంపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం సత్యనారాయుడు, ఎపిఎం బి.వెంకటరమణ, సిసిలు కె.శ్రీనివాసరావు, ఎస్.శ్రీరామ్ పాల్గొన్నారు.

370 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తగరపువలస: చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో సిటీ నగర్, కంచేరుపాలెం, కొసనవానిపాలెం, పాత మూలకుద్దు ఎంపిపి పాఠశాల, చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 370 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్.తాళ్లవలస ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శోభారాణి వైద్య పరీక్షలు చేశారు. మల్టీ విటమిన్స్ మందులను దివీస్ సంస్థ ద్వారా ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ మేనేజర్ సురేష్‌కుమార్, ప్రతినిధులు కె.నరసింహ, శేఖర్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుజిడి పనులకు భూమిపూజ



యుజిడి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి-కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధి రాజీవ్ గృహకల్ప, వైసిపి కాలనీలలో యుజిడి పనులకు కార్పొరేటర్ మొల్లి హేమలత గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యుజిడి సమస్య శాశ్వత పరిష్కారానికి సుమారు రూ.3 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యపై జివిఎంసి కౌన్సిల్‌లో మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో వార్డులో యుజిడి సమస్య పరిష్కారానికి సుమారు రూ.6 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో భాగంగా మొదట విడతగా రాజీవ్ గృహకల్ప, వైఎస్ఆర్ కాలనీలో రూ.3కోట్లతో పనులు ప్రారంభించామని, మిగిలిన పనులు కూడా తొందరగానే ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, నాయకులు వాండ్రాశి అప్పలరాజు, ఈగల రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, కొండపు రాజు, వంకా నూకరాజు, శ్రావణ్, చక్రి, నాగేశ్వరరావు, రాముసాయుడు, రమేష్, ఇమందిరాజు, ప్రమీలాదేవి, కృష్ణవేణి, మాధవ, రాంబాబు, రవీంద్ర, మోహన్, హరికృష్ణ, లక్ష్మీనారాయణ, అప్పారావు, వాయుకుమార్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభల పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి తదితరులు

ప్రజాశక్తి - తగరపువలస : అఖిల భారత సిఐటియు మహాసభల పోస్టర్‌ను తగరపువలస సిఐటియు కార్యాలయం వద్ద గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు మొదటిసారిగా విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతున్నాయని, కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. భీమిలి జోన్ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ, డిసెంబర్ 27 నుండి జనవరి 2వ తేదీ వరకు శ్రామిక ఉత్సవ్ పేరుతో సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నేలాతి రాము, ఆటో యూనియన్ నాయకులు పల్ల పెంటరాజు, నమ్మి నాయుడు, బమ్మిడి రమణ పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు



పశువులకు గర్భకోశ చికిత్సలు చేస్తున్న పశువైద్యులు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని బిఆర్.తాళ్లవలస పంచాయతీ పరిధిలో పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు గర్భకోస చికిత్స శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో పశువులకు ముందుగా పేడ, మూత్రం పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జగన్నాథం మాట్లాడుతూ, పశువుల పోషణతో ఎక్కువ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఈ ప్రాంతంలో పశు వైద్యశాల ఏర్పాటు చేయాలని కోరారు. బొచ్చుపేట, బి.తాళ్లవలస గ్రామాల్లో సుమారు 15 ఎకరాల భూమికి రైతుల వద్ద ఎటువంటి ఆధారాలూ లేవని, పరిశీలించి ఆధారాలు కల్పించాలని కోరారు. గోకులం షెడ్ల బిల్లులు ఇవ్వలేదని వెంటనే మంజూరుచేయాలని కోరారు. డిఎల్‌డిఎ చైర్మన్ గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, పశువుల్లో ఎటువంటి వ్యాధులున్నా ఇటువంటి కార్యక్రమాల్లో పరీక్షలు చేయించి అవసరమైన మందులు వాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శంకర్రావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఆగస్టు నుండి చేపట్టామని, వచ్చే సంవత్సరం జనవరి వరకు విశాఖపట్నం జిల్లాలో కొనసాగుతుందని తెలిపారు. డిసెంబర్ ఒకటి నుంచి లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన లేగ దూడల రైతులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి అప్పలస్వామి డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఉద్యానవన శాఖ విశాఖపట్నం ఎడిఎ సునీల్ కుమార్, ఎడిఎం ప్రసాదరావు, రెడ్డిపల్లి పశువైద్యాధికారి అనూష, పద్మనాభం పశువైద్యాధికారి మహేష్, డిఎల్‌డిఎ పశువైద్యాధికారి ఎస్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -తగరపువలస : భీమునిపట్నం మండలం తాటితూరులో ఒక పేద కుటుంబానికి బుడుమూరు సోమేశ్వరరావు, ఆకిరి మహేష్ ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థుల చదువును పరిశీలించేందుకు తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ బుడుమూరు సోమేశ్వరరావు గడపగడపకు వెళ్లే క్రమంలో గునిడి అనురాధ పిల్లలు గునిడి పవన్, వెన్నెల నిరుపేద కుటుంబాన్ని చూసి చలించిపోయారు. గృహనికి కరెంటు కనెక్షన్ కూడా పెట్టుకోలేని స్థితిలో ఉన్నారని గమనించి, తన స్నేహితుడు ఆకిరి మహేష్‌కు విషయం చెప్పారు. ఇరువురు కలిసి అనురాధ కుటుంబానికి నిత్యవసర సరుకులు, ఇంటికి కరెంట్ మీటర్, వైరింగ్ ఖర్చుల నిమిత్తం రూ.10 వేలును స్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ సభ్యులు సమక్షంలో అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి -మాధవధార : విశాఖ ట్రాఫిక్, రవాణా, అగ్నిమాపక సిబ్బంది సంయుక్త ఆధ్వర్యాన గురువారం కరాసలోని శివ శివాని పబ్లిక్ స్కూల్లో బస్సు, ఆటో, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముందుగా బస్సుల రికార్డులు తనిఖీ చేశారు. ఆటో, బస్సు డ్రైవర్లు వాహనాలను నడిపినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ సూచనలు తూచ తప్పకుండా పాటించాలని సూచించారు. బస్సుల్లో, ఆటోల్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, డిటిఐ ఆర్‌సిహెచ్ శ్రీనివాసరావు, ఎంవి ఇన్‌స్పెక్టర్, అగ్నిమాపక అధికారి రమణ, సిబ్బంది, బస్సు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల సందర్భంగా ఆ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులు, అంబులెన్సులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం పర్యవేక్షించారు. సంబంధిత మెడికల్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తగినన్ని మందులు, లాజిస్టిక్స్‌ను ఉంచుకోవాలని సూచించారు.

రాజకీయాలకతీతంగా పనిచేయాలి

ప్రజాశక్తి -గాజువాక : రాజకీయాలకతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పద్మశాలీల సంఘం నాయకులు పప్పు రాజారావు కోరారు. గాజువాక క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మన సామాజికవర్గం ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా అభివృద్ధి చెందేందుకు ఐక్యంగా కృషిచేయాలన్నారు. త్వరలో పద్మశాలీల ఆత్మీయ సమావేశం, వనమహోత్సవ కార్యక్రమంలో గాజువాకలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిక్కా సత్యనారాయణ, రాపర్తి సుబ్బారావు కొలిపాక అప్పారావు, తేడ్డపు సతీష్, సేసెట్టి అప్పారావు, కట్టా రామారావు, డాక్టర్ దుబా రాజు, మాడెము అప్పలరాజు, తుంగ్గం గంగరాజు, మాడెము ప్రభాకర్, బొజ్జ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ విద్యుత్ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులను త్వరగా పూర్తి చేయాలని గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రికి వైసిపి నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. వడ్లపూడి మెయిన్ రోడ్డులో జరుగుతున్న ఈ పనుల్లో జాప్యం వల్ల దుమ్ము, దూళి విపరీతంగా పెరిగిందని, దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో 87వ వార్డు వైసిపి ప్రెసిడెంట్ బొడ్డా గోవింద, చిత్రాడ వెంకటరమణ, ప్రగడ శ్రీనివాసరావు, ముద్దపు దామోదరరావు, దుగ్గపు దానప్పలు, పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యాన పలుచోట్ల కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టారు.

ఆనందపురం: మండలంలోని తర్లువాడ గ్రామంలో ఆనందపురం ఎంపిపి డాక్టర్ మజ్జి శారద ప్రియాంక, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు అధ్యక్షతన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో చందక సర్పంచ్ బంక శ్రీను, గొట్టిపల్లి సర్పంచ్ గంటా జగదీష్, గొట్టిపల్లి ఎంపిటిసి సభ్యులు దొంతల కనకరాజు, కంది సత్తిబాబు, మజ్జి నాగేంద్ర, బాలి రాంబాబు, పాలవలస మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డు పరిధి రెడ్డి కంచరపాలెంలో వైసిపి విశాఖ జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు కర్రి రామారెడ్డి, కార్యదర్శి శీరపు దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు పాల్గొని సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కెవిఎన్.శశికళ, వార్డు వైసిపి అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, ఎర్రంశెట్టి శ్రీనివాస్, కొప్పుల బద్రిమాధవ్, రఘునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గీతంలో బిజినెస్ ఇన్నోవేషన్స్‌పై సదస్సు

ప్రజాశక్తి-మధురవాడ : 'సుస్థిర సమాజ అభివృద్ధికి సరికొత్త వాణిజ్య నమూనాలు' అనే అంశంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 150 మందికి పైగా పరిశోధకులు, పారిశ్రామిక వేత్తలు, ప్రణాళికా నిపుణులు, వాణిజ్య నిపుణులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా అమెరికాలోని పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అనగప్ప గుణశేఖరన్ హాజరై సదస్సును ప్రారంభించారు. కర్బన ఉద్గారాలను తగ్గించే విధంగా, సమాజ హితంగా, డిజిటల్ పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నూతన వాణిజ్య నమూనాలను రూపొందించుకోవలసి ఉంటుందన్నారు. వ్యర్థాల నుంచి రీసైక్లింగ్ పద్ధతిలో సంపదను సృష్టించే విధంగా సర్క్యులర్ ఎకానమి ప్రపంచ దేశాలకు అవసరమన్నారు. నూతన వ్యాపారాలు పర్యావరణానికి మేలు చేసేవిగా ఉన్నప్పుడే దీర్ఘకాలం మనుగడ సాగించగలవన్నారు. సుస్థిర అభివృద్ధి నినాదం ప్రస్తుతం నిర్వహణలో ఉన్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు ఎదగడానికి ఒక మంచి అవకాశంగా పేర్కొన్నారు. హాంగ్‌కాంగ్ విశ్వవిద్యాలయం డిజిటల్ ఇన్నోవేషన్ నిపుణుడు డాక్టర్ కె.ప్రసన్న మాట్లాడుతూ, కృత్రిమ మేధ డేటా ఆధారంగా మాత్రమే పనిచేస్తుందని, ఈ కారణంగా కృత్రిమ మేధ ప్రయోజనాలను పొందాలంటే వివిధ రంగాలలో నిత్యం సమాచారాన్ని సేకరించి (డేటా కలెక్షన్) సమయానుకూలంగా వాడుకోగలిగిన వ్యవస్థ ఉండాలన్నారు. విశాఖలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ ద్వారా ఉద్యోగాలను సృష్టించడం, సమాజానికి ఉపయోగపడే కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం అవసరం అన్నారు. వ్యవసాయ, వైద్య, విద్యా, వాణిజ్య రంగాలలో కృత్రిమ మేధ రానున్న రోజులలో బలమైన ప్రభావాన్ని చూపించనుందని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, నిర్వాహక కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రాజా.పి.పప్పు మాట్లాడుతూ, ఆర్థిక రంగంలో వస్తున్న మార్పులు వాటి ప్రభావంతో రూపు దిద్దుకుంటున్న వాణిజ్య నమూనాలపై ప్రముఖుల ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సదస్సు సహ చైర్మన్ ప్రొఫెసర్ ఎన్.సాయి సుధాకర్ మాట్లాడుతూ, ఈ సదస్సులో వాణిజ్యరంగంపై పర్యావరణ మార్పుల ప్రభావం, డిజిటల్ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానంపై సహితం సదస్సులో చర్చిస్తామని తెలిపారు. అమెరికా, చైనా, యుకె, కెనడా తదితర దేశాల నుంచి విద్యా రంగ నిపుణులు సదస్సులో పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన ప్రతినిధులు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో ప్రభుత్వ విప్ గణబాబు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 40, 57, 89, 90, 91, 92 వార్డులకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బాధితులు యండమూరి సురేష్‌కు రూ.1,30,524, కర్రీ అన్నపూర్ణకు రూ.28,400, పసి లావణ్యకు రూ.2,32,857, కాకర హరికకు రూ.25,650, ఎ.సూరిదేముడుకు రూ.28 వేలు, వి.వెంకట శ్యామలకు రూ.20,524, మింది అప్పలరాజుకు రూ.1,01762, ఎస్.పాండాకు రూ.84,928, తుంపల శ్రీనివాసరావుకు 49,067, పి.కృష్ణవేణిసాహుకు రూ.75 వేలు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న సిఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొడ్డేటి విజయ్, పెంటకోట అజయ్‌బాబు, పొన్నాడ రమణారావు, గవ్వ భాస్కర్, అంగటి మూర్తి, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : 4వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధి ఎన్జీవోస్ కాలనీలోని జివిఎంసి హైస్కూల్లో విద్యార్థులకు కొత్త క్రిమినల్ చట్టాలపై సిఐ ఉమాకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఆకతాయిగా ఉండే విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, వార్డు కార్పొరేటర్ కిషోర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గణబాబు కుమారుని జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -యంత్రాంగం

గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు తనయుడు టిడిపి యువనేత మౌర్యసింహ జన్మదిన వేడుకలు గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు మౌర్యసింహ ద్వారా షీల్డ్‌లు, బహుమతులు అందించారు. అనంతరం పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో టిడిపి కార్పొరేటర్లు, కూటమి నేతలు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు, అభిమానులు పాల్గొని కేక్ కట్ చేశారు.


మౌర్య చేతుల మీదగా పేదలకు చీరలు పంపిణీ చేయిస్తున్న నక్క లక్ష్మణరావు

జివిఎంసి 89వ వార్డు పరిధి నాగేంద్రనగర్ జంక్షన్‌లో మౌర్య సింహ జన్మదిన వేడుకలను కార్పొరేటర్ దాడి వెంకట్ రమేష్, వార్డు అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా వేడుకల్లో మౌర్యసింహ పాల్గొని మాట్లాడుతూ, తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.


గోపాలపట్నంలో మౌర్యసింహను సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ములగాడ : పారిశ్రామి ప్రాంత పరిధి కొత్త నక్కవానిపాలెంలో మౌర్యసింహ జన్మదినవేడుకలను నిర్వహించారు. మౌర్య సింహకు నక్క లక్ష్మణరావు పూలమాలవేసి, బాణాసంచాతో, సన్నాయి మేళాలతో స్వాగతం పలికారు. అనంతరం కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. పుట్టిన రోజు వేడుకలకు హాజరైన అభిమానులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతంలోని 7 వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో యుటిఎఫ్ నాయకులు

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-పెందుర్తి : వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎమ్ఎమ్ఎస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావుచే తయారుచేసిన స్టడీ మెటీరియల్‌ను యుటిఎఫ్ నాయకులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, మెటీరియల్‌ను వినియోగించుకొని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. గత నాలుగేళ్ళుగా విద్యార్థులను ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు సిద్ధపరుస్తున్న గణిత ఉపాధ్యాయులు వంగా రామలక్ష్మిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సింహాచలంనాయుడు, యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా సహాధ్యక్షులు ఎన్.ప్రభాకర్, జిల్లా కార్యదర్శి చుక్క సత్యం, వంగా రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ జన్మదినం సందర్భంగా 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు గురువారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి దేశంలోనే విశాఖ ప్రథమ స్థానంలో ఉండేలా అభివృద్ధి చేయాలని బాణాల శ్రీనివాసరావు కోరారు.


కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బాణాల

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించారు. కలెక్టర్ స్వయంగా ధాన్యం నాణ్యతను పరిశీలించి, మార్చరైజ్ ప్రక్రియ, గ్రేడింగ్ విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలులో పారదర్శకత, కొనుగోలు రిజిస్ట్రేషన్ విధానం, రైతుల రాకపోకలు, కెపాసిటీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంపూర్ణ పారదర్శకతతో సేకరణ కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ దళారీ వ్యవస్థను రైతులు నమ్మాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం మంచి మద్దతు ధరకే కొనుగోలు చేస్తోందని చెప్పారు. 75 కిలోల బస్తాను రూ.1778కు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. దేవరాపల్లి మండలంలో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 20 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. కుట్టు, లోడింగ్, రవాణా సహా ఒక్క రూపాయి కూడా రైతు ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. అన్ని బిల్లులు ప్రభుత్వమే భరిస్తోందని స్పష్టం చేశారు. కొనుగోళ్లలో ఎక్కడైనా జాప్యం జరిగినా, సమస్య వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ ద్వారా వంద శాతం సబ్సిడీపై అందజేస్తున్న విత్తనాలను రైతులకు కలెక్టర్, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ అయేషా, డిఎస్ఓ కెవిఎల్ఎన్.మూర్తి, డిఎంఎస్ జె.జయంతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.ఆశాదేవి, సర్పంచ్ రొంగలి వెంకట్రావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, చిరికి గోవింద, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జనసేన మండల అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, డిడి నాయుడు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులు

ఉషా జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఉషా అండర్ 17 విభాగం జాతీయ స్థాయి పోటీల్లో మండలంలో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు, వెండి పతకాలను సాధించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న నారపిన్ని వర్షిక్ 45 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించగా, 48 కిలోల విభాగంలో 8వ తరగతి చదువుతున్న రాపర్తి గోవర్ధన్ సిల్వర్ మెడల్ సాధించారు. వీరు ఇటీవల జమ్మూకాశ్మీర్లో నిర్వహించిన జాతీయస్థాయి ఉషా పోటీల్లో పాల్గొన్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆళ్ల సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు కే నాగమణి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వి కృష్ణ అభినందించారు.

కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది పొగాకు వర్తక సంఘం ఆధ్వర్యంలో గురువారం మరిడి మాంబ గుడి వద్ద కార్తీక వన సమారాధన నిర్వహించారు. వర్తక సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా వన సమారాధనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జెడ్పిటిసి దొండా రాంబాబు, నారాయణమూర్తి, సన్యాసిరావు, నరేశ్, గిరిబాబు, శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, సయ్యపురెడ్డి సత్యనారాయణ, దొండా నానాజీ, పొగాకు వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి పౌర సన్మానం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి పద్మనాభ రాజుపేట మండల ప్రాథమికోన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కర్రి వీరభద్రరావును పేట బయ్యవరం ప్రజలు గురువారం పౌర సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నాయకులు మొగ్గ బాబురావు, ఎడ్ల నానాజీ, ఎడ్ల చినబాబు, గంజి రాము, రావూరి శ్రీనివాసరావు, ఎడ్ల కాంతారావు, ఎస్ఎంసి చైర్మన్ రాజేశ్వరి, చంద్రగిరి నాని, అడపా శ్రీనివాసరావు, ప్రవీణ్, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజాన శేషుకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ఎంపిపి రాజాన శేషుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి ఎంపిపిగా ప్రభుత్వంచే నియమితులైన వైస్ ఎంపిపి రాజాన శేషుకు గురువారం అభినందనలు వెల్లువెత్తాయి. జనసేన కార్యకర్తలతో పాటు కూటమి నేతలంతా ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడిఓతో సహా మండల పరిషత్ అధికార్లు మర్యాద పూర్వకంగా కలిసి తమ అభినందనలు తెలిపారు. లాంచనంగా సోమవారం కార్యాలయానికి వచ్చి బాధ్యతలు చేపడతానని ప్రజాశక్తికి తెలిపారు. త్వరలోనే అత్యవసర సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని చెప్పారు. తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆంజనేయ ఆలయ శిఖర పున:ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తారువా గ్రామంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ శిఖర పున:ప్రతిష్ట మహోత్సవం గురువారం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. గ్రామ పురోహితుడు కాసుబాబు నేతృత్వంలో పాకల కామేశ్వరరావు పంతులు వేద మంత్రోచ్చరణలతో శిఖర ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. శిఖరం పైనుంచి బూరెలు వేయడంతో వాటిని పొందేందుకు భక్తులు ఉత్సాహంగా పరుగులు తీశారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, కె.కోటపాడు జడ్పీటీసీ అనురాధ, స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 82 వార్డు లబ్ధిదారునికి మంజూరైన రూ.78000 చెక్కును లబ్ధిదారుని ఇంటి వద్దకు వెళ్లి జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ఆపరేషన్లు చేయించుకోలేని నిరుపేదలకు, ఖరీదైన వైద్యం పొందలేని రోగులకు కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందన్నారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాంకీలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణం కూటమి నాయకులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జనసేన నేత రాంకీ

ఎసిబికి చిక్కిన విఆర్ఒ

రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సూర్యనారాయణ



పట్టుబడిన నగదుతో విఆర్ఒ సూర్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లిలో మరో అవినీతి అధికారి ఏకంగా ఎమ్మార్వో కార్యాలయం వద్దే ఏసీబీ వలలో పడ్డాడు. లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా గురువారం పట్టుబడ్డాడు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం... మారేడిపూడి వీఆర్వో సూర్యనారాయణ అక్కిరెడ్డిపాలెం ఇంచార్జి వీఆర్వోగా కూడా పనిచేస్తున్నారు. అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సాలాపు శ్రీనివాస్ తన తండ్రి మరణించగా సర్వే నెంబర్15లో ఉన్న 3.5 ఎకరాల భూమికి సంబంధించి తన తల్లి పేరున మార్చేందుకు విఆర్ఒను ఆశ్రయించారు. దీనికి విఆర్ఒ సూర్యనారాయణ రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ.20 వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో శ్రీనివాస్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల ప్లాన్ ప్రకారం గురువారం తహశీల్దారు కార్యాలయం వద్ద విఆర్ఒ సూర్యనారాయణకు డబ్బులు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసిబి డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ వీఆర్వో ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. గతంలో తుమ్మపాలలో పనిచేసిన సదరు వీఆర్వోపై ఏమైనా ఫిర్యాదులు ఉంటే వాటిపైన కూడా విచారణ చేస్తామని వెల్లడించారు.

బస్సు షెల్టర్ నిర్మించాలని ఐద్వా ఆందోళన



ఆందోళన చేస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతపురం జంక్షన్‌లో బస్సు షెల్టర్ నిర్మించాలని ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆర్ లక్ష్మి మాట్లాడుతూ జిల్లా నలుమూలలకు అచ్యుతాపురం జంక్షన్ నుంచి ప్రయాణం చేసే ప్రయాణికులకు నిలువ నీడ లేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఎండకు ఎండి వర్షానికి తడిసి నిలబడి బస్సులకై నిరీక్షించాల్సి వస్తుందని చెప్పారు. అచ్చుతాపురంలో తక్షణం బస్సు షెల్టర్ నిర్మించాలని ఆమె డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసినట్లు ప్రభుత్వం చెబుతుందని, అయితే మహిళల ప్రయాణం సంఖ్య పెరిగిన కారణంగా బస్సుల సంఖ్య పెంచాల్సి ఉందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి బస్ స్టాఫ్ నిర్మాణానికి, అదనపు బస్సులు తిప్పడానికి ప్రయత్నించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మ, లక్ష్మి, భవాని, జ్యోతి, రాణి, సౌజన్య, లావణ్య, రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అదనపు న్యాయవాది కన్నూరుకు అభినందనలు

ప్రజాశక్తి-కశింకోట : విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయస్థానం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో గ్రేడ్-1 అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా అధికారికంగా విధుల్లో చేరిన కన్నూరు అప్పలనాయుడుకు కసింకోట మాజీ మండల ప్రెసిడెంట్ కూండ్రపు రామానాయుడు, పిపిఎస్.నాయుడు, రెడ్డి అప్పలనాయుడు, యడ్ల సత్యనారాయణ, స్వగ్రామం పాత కన్నూరు పాలెం గ్రామానికి చెందిన రెడ్డి మహాలక్ష్మి నాయుడు, బండారు అప్పలనాయుడు, మంగి శ్రీను, హరీష్, కర్రి అప్పారావు, కన్నూరు నూకి నాయుడు, కన్నూరు నాయుడు, కోనేటి పెంటయ్య, కర్నూలు రామనాయుడు, పైడితల్లి, రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఆదర్శ పాఠశాలను సందర్శించిన డైట్ అధ్యాపకులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : కె.కోటపాడు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను భీమునిపట్నం జిల్లా విద్యా శిక్షణ పరిశోధన సంస్థ (డైట్) సీనియర్ లెక్చరర్ బి.సునీత, జూనియర్ లెక్చరర్ వి.వసుంధర గురువారం సందర్శించారు. పాఠశాలలో పిల్లల విద్యా సామర్థ్యాలను, ఉపాధ్యాయుల పనితీరును, రికార్డులను పరిశీలించారు. టీచర్స్ హ్యాండ్, అసెస్మెంట్, హోమ్ వర్క్ బుక్స్‌ను, హొలిస్టిక్ కార్డ్స్‌ను తనిఖీ చేశారు. పిల్లల విద్యా సామర్థ్యాలను ఇంకా మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. టీచర్స్ టీంవర్క్‌ను వారు అభినందించారు. విద్యార్థుల నమోదును ఇంకా పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. డైట్ విద్యార్థి కె.వికాస్ చేస్తున్న గ్యారెంటెడ్ ఎఫ్ఎల్ఎన్ సర్వేను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 డివిడి.ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుని వి.శోభారాణి, ఉపాధ్యాయులు సూరెడ్డి శ్రీనివాసరావు, సిరపరపు ఈశ్వరరావు, ఐ.రేవతి, ఇ.శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డైట్ అధ్యాపకులు



టిడిపి నేత సాయికృష్ణను సత్కరిస్తున్న రైతులు

రైతుల కమతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక పేట కట్టు మూల సంఘం రైతు కమతాలలో విద్యుత్ దీపాలను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ బుధవారం రాత్రి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు చీకటి పడిన తరువాత కమతాలలో సంచరించే సమయాన్న విష కీటకాల బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన గ్రామ రైతు సంఘం సర్వసభ్య సమావేశంలో గ్రామంలోని 12 రైతు మూల సంఘాల కమతాల్లో తన సొంత నిధులతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తానని రైతులకు హామీ ఇచ్చామని గుర్తు చేశారు. ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఇటీవల ములబందలో విద్యుత్ దీపాలు వేయగా, ఇప్పుడు పేట కట్టు ప్రాంతాలకు వేసినట్లు చెప్పారు. అనంతరం పేటకట్టు రైతులు సాయికృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రైతులు మల్ల సంజీవరావు, మల్ల జగ్గారావు, టెక్కలి పరశురాం, కాండ్రేగుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సిఐకి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైసిపి నాయకులు

సిఐని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : నూతనంగా బాధ్యతలు చేపట్టిన పట్టణ సిఐ ప్రేమ్ కుమార్‌ను గురువారం వైసిపి 80వ వార్డ్ ఇంచార్జ్ కెఎం నాయుడు, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ తదితరులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్స్ విల్లూరి శివ సూరి, మొగలపల్లి సుబ్బారావు, సూరిశెట్టి సత్తి బాబు, రాపేటి మహాలక్ష్మి నాయుడు, శ్రీధరాల మనోజ్, ఎల్లపు గాంధీ, ఏడువాకల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : ప్రభుత్వం అందజేస్తున్న హౌసింగ్ స్కీములను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి పడ్డాది టౌన్ అధ్యక్షులు దొండ నరేష్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇళ్ల స్కీములకు అర్హులైన వారు ప్రతి ఒక్కరూ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వడ్డాది జనసేన అధ్యక్షుడు దొండా సాయి, ప్రధాన కార్యదర్శి దొండ నానాజీ, దూది రాజేష్, దొండా రమేష్, కోరుకొండ గురుమూర్తి, అక్కిరెడ్డి కనక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేత దొండ నరేష్

వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ ఎన్నికల కమిషన్ వంటి వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జాయింట్ సెక్రెటరీ, పిసిసి అబ్జర్వర్ సుశాంత్ మిశ్రా విమర్శించారు. స్థానిక విజయ రెసిడెన్సీలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్రింది స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో పనిచేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నాయకులు కార్యకర్తలను కలిసి డిసిసి అధ్యక్షుల నియామకానికి అభిప్రాయాలు సూచనలు సేకరించడం జరుగుతుందని చెప్పారు. డిసిసి అధ్యక్షులుగా పనిచేసేందుకు ఉత్సాహంగా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పారదర్శకంగా నాయకత్వ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం ఇద్దరు ముగ్గురు చేతుల్లో నడుస్తూ అంబానీ, అదానీల ప్రయోజనం కోసం పనిచేస్తుందని ఎద్దేవా చేశారు. బిజెపి ప్రభుత్వంలో పత్రికలపై దాడులు పెరిగాయన్నారు. ఫేక్ ఓటర్ల జాబితాను బయటపెట్టాలని రాహుల్ గాంధీ జాతీయ ఎన్నికల కమిషన్ను కోరిన దానిపై సమాధానం ఇవ్వలేదన్నారు. వ్యవస్థలను బలోపేతం చేయడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న, పిసిసి అబ్జర్వర్ బోడ వెంకట్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సమన్వయకర్త బోయిన భానుమూర్తి యాదవ్, జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎఐసిసి జాయింట్ సెక్రెటరీ సుశాంత్ మిశ్రా

30న నవోదయ, సైనిక్, ఆర్ఎంఎస్ మోడల్ పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి హర్ష (హెచ్విఎల్) అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 30న నవోదయ, సైనిక్ అండ్ ఆర్ఎంఎస్ రాష్ట్రస్థాయి మోడల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అకాడమీ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ అకాడమీ ద్వారా 2025 పరీక్షల్లో గణనీయమైన ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమమైన 36 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారన్నారు. ఏఐఎస్ఎస్ఇఈ టాపర్స్‌గా ఎనిమిది మంది, ఆర్ఎంఎస్‌కు ముగ్గురు, నవోదయకు ఆరుగురు ఎంపికైనట్లు చెప్పారు. దేశం మొత్తం మీద ఉన్న ఐదు ఆర్ఎంఎస్ పాఠశాలలో అనకాపల్లి ఇన్స్టిట్యూట్ నుంచి ముగ్గురు విద్యార్థులు రాష్ట్రం నుంచి ఎంపికైన అకాడమీగా హెచ్విఎల్ పేరు సంపాదించిందన్నారు. ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాల్లో మోడల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పెందుర్తి, గాజువాక, నర్సీపట్నం, కాకినాడ, రాజమండ్రి, అచ్యుతాపురం, ఎలమంచిలి, అడ్డు రోడ్డు, పాయకరావుపేట, రావికమతం, విజయవాడ, గుంటూరు, చోడవరం, పాడేరు, చీడికాడ, దేవరాపల్లి కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షల్లో 40 మంది విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంస పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. నవోదయ, ఆర్ఎంఎస్ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, అలాగే సైనిక్ పరీక్ష మధ్యాహ్నం 1:30 నుంచి 4 గంటలకు వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జామెంటరీ బాక్సులు, మ్యాప్ బుక్స్ అందజేస్తున్న టిడిపి నేతలు

విద్యార్థులకు జామెంటరీ బాక్సుల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు మ్యాప్ పాయింట్ బుక్స్, ప్యాంక్స్, జామెంట్రీ బక్సులు పంపిణీ చేశారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొట్టడం, మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇపిడిసిఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని వల్ల తిక్కవనిపాలెం, దల్లెపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, దొసూరు, ముత్యాలమ్మపాలెం, ఊటగెడ్డపాలెంతో పాటు పరిసర గ్రామాలకు ఐదు గంటలపాటు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

యలమంచిలి టౌన్ : 33/11కెవి యలమంచిలి సబ్ స్టేషన్, 11కెవి టౌన్ 1, టౌన్ 2, టౌన్ 3, టౌన్ 4, 11కెవి రామారాయుడుపాలెం ఫీడర్స్ పరిధిలోనిఇ యలమంచిలి టౌన్, రామారాయుడుపాలెం, కొత్తపాలెం, సోమలింగపాలెం కొత్తపేట, దిమిలి రోడ్డు, మెయిన్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే యలమంచిలి సెక్షన్ 33/11కెవి పురుషోత్తపురం సబ్ స్టేషన్, 11కెవి పురుషోత్తపురం, 11కెవి పేరంటాలపాలెం, 11కెవి పిఎన్ఆర్ పేట ఫీడర్స్ పరిధిలో గల పిఎన్ఆర్ పేట, బయ్యవరం, పులపర్తి, పురుషోత్తపురం, కృష్ణాపురం, లక్కవరం, కృష్ణాపురం, పోతిరెడ్డి పాలెం, రేగుపాలెం, రామభద్రపురం, వెంకునాయుడిపాలెం, లైన్ కొత్తూరు గ్రామంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె రాజశేఖర్ తెలిపారు.

అనకాపల్లి : అనకాపల్లి మండలం కొత్తూరు సెక్షన్ లోని 33/11 కె.వి సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ వర్క్ కారణంగా ఈనెల 28న ఉదయం 9 నుండి రాత్రి 10 వరకు కొత్తూరు సెక్షన్ పరిధిలో గల సంపతిపురం, చిన్నసంపతిపురం, వేట జంగాలపాలెం, వెంకుపాలెం(ఎస్), సత్యనారాయణ పురం, కుంద్రం, కుంచంగి, కొత్తూరు, పిసినికాడ గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుంది. కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

అనాలోచిత స్పీడ్ బ్రేకర్ల వల్ల ఇబ్బందులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రైల్వే శాఖకు సంబంధించిన కాంట్రాక్టర్ అనాలోచిత, రోడ్ గైడెన్స్ పాటించకుండా నిర్మించిన అతి భారీ ప్రమాదకరమైన స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానిక కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం స్పీడ్ బ్రేకర్ల వద్ద నిరసన తెలియజేశారు. ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఇటువంటి భారీ స్పీడ్ బ్రేకర్లు ఎలా నిర్మిస్తారని, ప్రజల ప్రాణాలతో రైల్వే శాఖ చెలగాటం ఆడుతుందని వాపోయారు. ఇబ్బందికర పరిస్థితుల్లో వాహనాలు స్పీడ్ బ్రేకర్ మీద నడుస్తున్నాయని, ఈ స్పీడ్ బ్రేకర్ వల్ల చాలామంది బ్యాలెన్స్ కాచుకోలేక పడిపోయారని, మనిషి వెన్నెముకకు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వాహనాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.



స్పీడ్ బ్రేకర్స్ వద్ద నిరసన తెలుపుతున్న కూటమి నేతలు

కోనో కార్పస్ చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు వ్యాప్తి చెందించే కోనో కార్పస్ చెట్లను గురువారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ కే చక్రవర్తి, ఉద్యానవన శాఖ అధికారి ప్రియాంక ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ కార్యాలయం సిబ్బందిచే తొలగించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ చక్రవర్తి మాట్లాడుతూ ఈ చెట్ల కొమ్మలు పెరగడంతో రాత్రిపూట చెట్ల నీడలో విద్యుత్ వెలుతురు సరిగ్గా పడక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చలికాలంలో ఈ చెట్ల పుప్పొడి వల్ల ఆస్తమా దగ్గు ఎలర్జీ వ్యాపిస్తాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని ఈ చెట్లు తొలగించడం జరుగుతుందన్నారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న దిలీప్ కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల ఇందిరా నగర్ శ్రీ గౌరీ పరమేశ్వరులను వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద గురువారం దగ్గర భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పిడి గాంధీ, ఎంపీటీసీ పంచదార కన్నారావు, వార్డు మెంబర్లు తర్రా సత్యా రావు, గ్రామ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : కొక్కిరపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు మొటూరు గోపినాథ్ తన స్వగ్రామం యలమంచిలి పట్టణంలోని 19వ వార్డు యర్రవరంలో పేద వృద్ధులకు దుప్పట్లు, పసి పిల్లలకు సానిటరీ వాటర్ ప్రూఫ్ బెడ్ షీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు నడిగేట్ల తాతాజీ, సంతోష్ కుమార్, మహేష్, శ్రీను, అశోక్, శివ, ధరణి, లోవరాజు పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న గోపినాథ్ తదితరులు

వైద్యకళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ
రేపు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని పది ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పేరుతో ప్రైవేటీకరణ చేయటాన్ని నిరసిస్తూ ఈనెల 29న శనివారం ఉదయం 9:30 గంటలకు డాబా గార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల, విద్యార్థి, యువజన, స్వచ్ఛంద సంస్థల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పివి రమేష్ అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీలు, పౌర సంస్థల రాష్ట్ర నేతలతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఏర్పడిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత జరిగే రౌండ్‌టేబుల్ సమావేశానికి ప్రధాన వక్తగా నాగార్జున విశ్వ విద్యాలయ పూర్వ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ ప్రసంగిస్తారని, వివిధ రాజకీయ పార్టీలు పౌర సంస్థల నేతలు పాల్గొంటారని తెలిపారు. అభ్యుదయ కాముకులు, ప్రజాస్వామ్య వాదులు, రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

జూ పార్కులో జూనియర్ దళపతి
పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో జూనియర్ దళపతి (జూనియర్ హిప్పోపోటమస్) 8వ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ కాలేజీ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు జూనియర్ దళపతి పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. కూరగాయలు, పండ్లతో అలంకరించిన ఆహారాన్ని జూనియర్ దళపతికి అందించారు. దీనిలో భాగంగా సిపిఐ కాలేజీ యాజమాన్యం జూనియర్ దళపతిని ఒక్క రోజు, వీటితో పాటు రెడ్ నెక్డ్ వాలజీ, బ్లాక్ స్వాన్స్, రింగ్-టెయిల్డ్ లెమూర్‌లను ఒక ఏడాది పాటు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ, జూ పార్కులో జంతువులను దత్తత తీసుకోవడం పట్ల సిపిఐ కాలేజీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ వ్యవస్థలో హిప్పోల పాత్రను, వాటి సంరక్షణ తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కళాశాల సిఇఒ బి.ఆదినారాయణ, వైస్ ప్రిన్సిపల్ దివ్య, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రాజ్యాంగంపై అవగాహన అవసరం



రాజ్యాంగం పుస్తకాలను పంపిణీ చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రాజ్యాంగంపై ప్రతిఒక్కరూ అవగాహనను పెంచుకుని, రాజ్యాంగ స్ఫూర్తితో సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. గురువారం నగరంలోని ఎంవిపి కాలనీలోని గిరిజన భవన్‌లో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం విశాఖజిల్లా అధ్యక్షుడు సొనాయి అప్పలరాజు అధ్యక్షతన రాజ్యాంగదినోత్సవ వేడుకల్లో సుభద్ర పాల్గొని, విద్యార్థులకు రాజ్యాంగ పుస్తకాలను అందజేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, దాని గొప్పదనంపై ప్రజలకు, ముఖ్యంగా యువతరానికి అవగాహన కల్పించేందుకు సంఘం కృషిని అభినందించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిజి జి.బాలకృష్ణ, సంఘం నేతలు ఓ రామూర్తి, కొక్కుల రామారావు, బాకా సత్యారావు, రామ నాయుడు, కోరాబు సత్యనారాయణ, రాథోడ్, సీసా శోభన్, ఎస్. తిలక్, జంపరంగి రాము, ఎం ప్రసాదరావు పాల్గొన్నారు.

పరుగు పందెంలో దిలీప్‌కు ప్రథమ స్థానం



సర్టిఫికెట్ అందుకుంటున్న దిలీప్

ప్రజాశక్తి -పద్మనాభం : జిల్లా స్థాయిలో నిర్వహించిన వికలాంగుల 1500 మీటర్ల పరుగుపందెంలో పద్మనాభంలోని భవిత మండల విద్యా కేంద్రంలో చదువుతున్న దిలీప్ పథమ స్థానం సాధించాడు. సమగ్ర శిక్ష, పారాస్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్తంగా జిల్లాస్థాయి వికలాంగ పిల్లల క్రీడా పోటీలు తోటగరువు హైస్కూల్లో నిర్వహించారు. మేథో వైకల్యం, దృష్టిలోపం, చలన సమస్యలు కలిగిన పిల్లలకు 100, 200, 400, 1500 మీటర్ల రిలే, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్ త్రో, లాంగ్ జంప్, హైజంప్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పరుగులో ప్రథమ స్థానం సాధించిన దిలీప్‌కు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ బహుమతి ప్రదానం చేశారు.

విశాఖ డెయిరీ నిధులతో షెల్టర్ నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న రమాకుమారి, తదితరులు

ప్రజాశక్తి -మాడుగుల.: మండల కేంద్రమైన మాడుగులలో దేవీ ఆలయం వద్ద భక్తులకు నీడను కల్పించేందుకు విశాఖ డెయిరీ నిధులు రూ. 5లక్షలతో షెల్టర్ నిర్మాణానికి యలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతులకు విశాఖ డెయిరీ అండగా నిలుస్తుందన్నారు. డెయిరీ నిధులతో గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అంతకుముందు ఎం. కోటపాడులో విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద డెయిరీ మాజీ చైర్మన్ ఆడారి తులసిరావు విగ్రహ ఏర్పాట్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం మోదకొండమ్మ దేవి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోటార్ యూనియన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఆలయ గౌరవ అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు, ఆలయ అధ్యక్షులు కొండలరావు, దంగేటి సూర్యారావు, శీరంరెడ్డి సూర్యనారాయణ, సర్పంచి యడ్ల కళావతి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గంగాదేవి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో గాదంపాలెం గ్రామంలో గంగాదేవి ఆలయాన్ని గురువారం సర్పంచ్ నల్లబెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అధిక సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

6న అవంతిలో ప్రగ్యాన్ పాలిఫెస్ట్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో అవంతి పాలిటెక్నికల్ కాలేజీ ఆధ్వర్యంలో డిసెంబర్ 6వ తేదీన నిర్వహించే ప్రగ్యాన్ 2025 స్టేట్ లెవెల్ టెక్నికల్ ఫెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ కళాశాలల విద్యార్థులు తయారుచేసిన క్రొత్త ప్రయోగాలు, నైపుణ్యం, భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేయనున్నాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. సాంకేతిక ఉత్సవంలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్ వంటి కార్యక్రమాలను నిర్వహించి అత్యున్నత ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా అందజేయనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డిప్లమో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బి.జగదీశ్వరరావు తెలిపారు.

అవంతిలో ఐడియాథాన్

ప్రజాశక్తి -తగరపువలస : అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంచే ఐడియాథన్ 2025ను ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌తో కలిపి నిర్వహించారు. 100 బృందాలుగా సుమారు 475 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ఉన్న విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపేలా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చూపించారు. విజేతలకు ముత్తంశెట్టి శ్రీనివాసరావు బహుమతులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.చంద్రశేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, జి.అనంతరావు, పి.శంకరరావుపాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ప్రజాశక్తి- రావికమతం: మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన కొనగళ్ల కాశీ విశ్వనాథం, సుమిత దంపతులతో ఆలయ అర్చకులు రాచకొండ లక్ష్మీనారాయణమూర్తి శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. ముక్కా జోగేశ్వరరావు దంపతులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విశ్వనాథం దంపతుల ఆర్థికసాయంతో కల్యాణోత్సవంతోపాటు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

లింగ వివక్షత విడనాడాలి



రావికమతంలో మహిళలు నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి- రావికమతం : సమాజంలో స్త్రీల పట్ల చిన్నచూపు తగదని, లింగ వివక్షత లేకుండా అన్ని రంగాలలో కూడా పురుషులతో సమానంగా మహిళలను ప్రోత్సహించాలని సెర్ప్, వెలుగు ఉద్యోగులు పిలుపునిచ్చారు. గురువారం రావికమతం వెలుగు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లింగ సమానత్వంపై ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 25 నుంచి వచ్చేనెల 23 వరకు లింగసమానత్వంపై అవగాహన ర్యాలీలు, సదస్సులను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు నిరోధించడం, మహిళలకు తగిన గౌరవం కల్పించడం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ర్యాలీ నిర్వహించారు.

పలు గ్రామాల్లో 'రైతన్నా..మీ కోసం'



మాడుగులలో కరపత్రాలు పంచుతున్న ఉద్యోగులు, నేతలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఆకు కూరలు సాగు చేస్తున్న రైతులను కలిసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అల్లంసెట్టి మోహనరావు, సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, తాట్రాజు అప్పారావు, బాలి అయ్యప్ప, మజ్జి సన్యాసినాయుడు, వ్యవసాయ శాఖ హార్టికల్చర్ అధికారి దేవి, వెటర్నరీ ఎహెచ్ సుజాత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల ఎంపిక, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు పథకాల వినియోగం వంటి అంశాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం అమలు చేయడం ద్వారా రైతు ఆదాయం పెరుగుతుందన్నారు. ఆకు కూరల సాగులో రబీ డ్రై సోయింగ్ విధానం అమలు చేయాలని సూచించారు. ఈ పద్ధతిని అనుసరిస్తే భూమిలో పోషక విలువలు పెరిగి, సేంద్రియ కార్బన్ స్థాయిలు మెరుగుపడుతాయని వివరించారు.

మాడుగుల. : మండలంలోని పొంగలిపాక గ్రామంలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో పంచసూత్రాలు అమలు, అన్నదాత సుఖీభవ, పిఎంకిసాన్ పథకాలు ద్వారా రైతులకు కలిగే మేలుపై ఇంటింటికీ అధికారులు, ప్రజా ప్రతినిధుల బృందం వెళ్లి, , కరపత్రాలను పంచి, రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కొంకి అప్పారావు, మండల వ్యవసాయాధికారి అనసూయ, అగ్రికల్చర్ అసిస్టెంట్ గణేష్, గ్రామసర్పంచ్ నాయన సత్యనారాయణ, కింతలి పిఎసిఎస్ చైర్‌పర్సన్ ఉండూరు దేముడు, నీటిసంఘం అధ్యక్షుడు బంటు మల్లునాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని, అసంపూర్తిగా నిలిచిపోయిన పలు భవనాలను ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు పరిశీలించారు.

ఖేలో ఇండియా బాక్సింగ్ పోటీలకు జాతీయ రిఫరీగా కిరణ్ సాగర్


దండు కిరణ్‌సాగర్

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్/ ఎంవిపి.కాలనీ : వచ్చేనెల ఒకటి నుంచి ఐదు వరకు రాజస్థాన్‌లోని భరత్‌పూర్ వేదికగా జరగనున్న ఖేలో ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టీస్ గేమ్స్ - 2025 బాక్సింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి జాతీయ బాక్సర్ దండు కిరణ్‌సాగర్ రిఫరీగా ఎంపికయ్యారు. సాగర్ ఎంపిక రాష్ట్రానికి, ఆయన పనిచేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వేకు ఎంతో గర్వకారణమని ద్రోణాచార్య అవార్డీ, బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు, విశాఖపట్నం జిల్లా బాక్సింగ్ కార్యదర్శి బి. అప్పన్నరెడ్డి హర్షం వ్యక్తం చేశారు..కిరణ్ సాగర్ ప్రస్తుతం ఈస్ట్ కోస్ట్ రైల్వేలో చీఫ్ టికెట్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వరల్డ్ బాక్సింగ్, ఆసియాన్ బాక్సింగ్ పోటీలతో సహా మొత్తం 8 అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్ లలో పాల్గొని దేశానికి పతకాలు సాధించారు. జిల్లా,రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ వేదికపై నిలబెట్టిన ఆయన కృషిని విశాఖపట్నం బాక్సింగ్ సంఘం ప్రత్యేకంగా అభినందించింది. కిరణ్ సాగర్ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దండు నాగేశ్వరావు కుమారుడు కావడం విశేషం.

తాగునీటి సౌకర్యం కల్పనపై కల్యాణపులోవ గిరిజనుల హర్షం


కుళాయిల వద్ద బిందెలతో నీరు పడుతున్న గిరి మహిళలు

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో చీమలపాడు పంచాయతీ కల్యాణపులోవ ఆదివాసి గిరిజనులకు మంచినీటి సౌకర్యం కల్పనపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు అందించిన ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో జల జీవన మిషన్ పథకం ద్వారా వాటర్ ట్యాంకు, ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ అది సక్రమంగా పనిచేయకపోవడం, ట్యాంకుకు నీరు చేరకపోవడంతో గ్రామంలోని కుళాయిలకు నీరు సరఫరా కానిపరిస్థితి నెలకొంది.. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కాలువల్లోని నీటిని తెచ్చుకుని తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. రక్షిత తాగునీరు అందక తాము పడుతున్న కష్టాలపై స్థానిక ఆదివాసీ గిరిజనులు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నారు. అంతేకాక నీటి సమస్యను పరిష్కరించాలని ఆదివాసి గిరిజనులు ఆందోళన చేపట్టారు. తక్షణమే స్పందించిన ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కొత్త బోరును ఏర్పాటు చేసి, మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలపై స్పందించిన అధికారులకు స్థానిక గిరిజన మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-గొలుగొండ: రోడ్డు భద్రతా నియమాలను వాహనదారులు కచ్చితంగా పాటించాలని గొలుగొండ ఎస్ఐ పి.రామారావు అన్నారు. గురువారం మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు పూర్తిగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వారు ఫోన్ చేసి వివరాలు యుపిఐ పిన్ లేదా ఒటిపి వంటివి అడిగితే చెప్పరాదన్నారు. క్యాష్ బ్యాక్ లేదా రివార్డులను క్లెయిమ్ చేస్తూ అనుమానస్పద లింకులపై క్లిక్ చేయొద్దన్నారు. చెల్లింపులు చేసే ముందు వ్యాపారి వివరాలను ధ్రువీకరించుకోవాలన్నారు.

పాఠశాల విద్యలో జియో స్పేషియల్ టెక్నాలజీ వినియోగంపై

5,6 తేదీల్లో సదస్సు


సదస్సు పోస్టర్ల ఆవిష్కరణలో ప్రొఫెసర్ జగదీశ్వరరావు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా వచ్చేనెల 5,6 తేదీల్లో ఇస్రో సహకారంతో జియో ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జియో స్పేషియల్ స్మార్ట్ థింకింగ్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అంశంపై రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కన్వీనర్, జియో ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.జగదీశ్వరరావు తెలిపారు. గురువారం విభాగంలో విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. తొలిరోజున పాఠశాలల ఉపాధ్యాయులకు సదస్సుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము అవసరం లేదని, ఆసక్తి గలవారు పేర్లు మోదు చేసుకోవాలన్నారు.పాల్గొనే వారికి కిట్, భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. సదస్సు రెండవ రోజున పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన, ఆసక్తి పెంచేలా ప్రత్యేక సాంకేతిక ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. శాటిలైట్ నమూనాలు, సాంకేతిక పరికరాలపై విద్యార్థులను అవగాహన కల్పిస్తామన్నారు.ఉన్నత పాఠశాల విద్యార్థులకు డిజిటల్ జియోస్పేషియల్ విద్యను పాఠశాల విద్యలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు.

యువతలో మార్పుతోనే మెరుగైన సమాజం

ఎయు కళాశాలల అభివృద్ధి మండలి డీన్ ప్రొఫెసర్ కృష్ణ


పరీక్షల విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎయు ప్రొఫెసర్ కృష్ణ

ప్రజాశక్తి - పాయకరావుపేట : మెరుగైన సమాజానికి యువత ఆలోచనలు, నడవడికలో మంచి మార్పు రావాలని ఆంధ్ర యూనివర్సిటీ కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ప్రొఫెసర్ టివి కృష్ణ అన్నారు. గురువారం శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల అటానమస్ సందర్శించారు. కళాశాలలో నూతన పరీక్షా విభాగాన్ని, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ విభాగాలను ప్రారంభించారు. కళాశాలలో అన్ని విభాగాలను, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, యూనివర్సిటీ స్థాయిలో స్పేసస్ కళాశాల ఉందని, ఇక్కడి సదుపాయాలను, వనరులను విద్యార్థులు ఉపయోగించుకొని, బాగా చదువుకుని, జ్ఞానాన్ని సంపాదించి దేశానికి ఉపయోగపడాలని తెలిపారు. విద్యార్థులు తమ కాలాన్ని సద్వినియోగపరుచుకున్నపుడే ఉన్నత స్థితికి చేరుకుంటారని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ రామకృష్ణా రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ల్యాబ్ సీజ్‌పై న్యాయ పోరాటం



ల్యాబ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉమాదేవి

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : బల్క్ డ్రగ్ పార్కుకు భూమిని ఇవ్వనని చెప్పడంతోపాటు రాజయ్యపేటలో హోంశాఖ మంత్రి అనిత సమక్షంలో బల్క్‌డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మాట్లాడాననే కక్షతోనే అడ్డురోడ్డులోని తన డయాగ్నస్టిక్ సెంటర్, ల్యాబ్‌ను అధికారులు సీజ్ చేశారని దాని నిర్వాహకురాలు దాట్ల ఉమాదేవి నిరసన వ్యక్తం చేశారు. అడ్డరోడ్డు లోని తన జ్యోతి లేబరేటరీని సీజ్ చేయడంపై న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు. గురువారం మండలంలో వ్యాపార కేంద్రం అడ్డరోడ్డులో జ్యోతి లేబరేటరీలో జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. గురువారం సాయంత్రం అడ్డరోడ్డు వచ్చిన జిల్లా వైద్య, ఆరోగ్యం, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు జ్యోతి ల్యాబ్‌ను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా లేదంటూ ల్యాబ్‌ను సీజ్ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే జిల్లాలో ఏ మెడికల్ ల్యాబ్‌కు లేని విధంగా తన ల్యాబ్‌పైనే అధికారులు కక్షపూరితంగా వ్యవహరించడం దుర్మార్గమని దాట్ల ఉమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు.. జిల్లాలో ఏ ల్యాబ్‌లకు వర్తించని నియమ నిబంధనలను తన ల్యాబ్‌కు వర్తింప చేయడం ఏమిటని ఉమాదేవి ప్రశ్నించారు. తన మీద కక్షపూరితంగా రాజకీయంగా కుట్ర పన్ని ల్యాబ్ సీజ్ చేశారని మండిపడ్డారు. జిల్లాలో కనీస సౌకర్యాలు, సర్టిఫికెట్లు, అనుమతులు లేని ల్యాబ్‌లు ఎన్నో ఉన్నాయని, వాటిల్లో ఏ ఒక్కదాని జోలికి వెళ్లని అధికారులు తన ల్యాబ్‌ను మూసేయడం దుర్మార్గమన్నారు. అధికారుల చర్యలను నిరసిస్తూ తన ల్యాబొరేటరీ ఎదుట బైఠాయించి, హోంమంత్రి, అధికారులకు వ్యతిరేకంగా తన ఆవేదన, ఆక్రోశం వెల్లగక్కి నిరసన చేపట్టారు తన ల్యాబ్ మూసేసినంత మాత్రాన బల్క్‌డ్రగ్ పార్కుకు భూములిస్తాననుకోవడం భ్రమేనని, తన ప్రాణం పోయినా, ఇంకా ఎటువంటి నష్టం వచ్చినా వెనక్కు తగ్గేది లేదన్నారు. తనకు ఏం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ఉమ్మడి విశాఖ జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి


సూచనలు చేస్తున్న జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి : పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని, గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలో సిహెచ్ లక్ష్మీపురంలో పర్యటించారు. తడిపొడి చెత్త సేకరణ, సంపద తయారీ కేంద్రానికి తరలింపును పరిశీలించి తగు సూచనలు చేశారు. చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి, వర్మీ కంపోస్ట్ విధానాన్ని పరిశీలించారు. చెత్త నుండి సంపద సృష్టించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి చైతన్య, ఆర్ డబ్ల్యుఎస్ ఇఇ శివ ప్రసాద్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నిత్యావసరాలు


నిత్యావసర సరుకులు అందజేస్తున్న కేటరింగ్ రాజు

ప్రజాశక్తి -ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పరిధి గాంధీనగర్‌లో పోలిపిల్లి కన్నారావు మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక తెలుగుదేశం నాయకులు కాకి గంగరాజు గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. 50 కేజీలు రైస్, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ముగడ రాజారావు, సారిపల్లి రాము, మూది అప్పారావు, రంగాల మంగరాజు, సింహాద్రి శేఖర్, పచ్చిపాల శ్రీను, కుందూరు నగేష్, కుందూరు శ్రీను, బొండపల్లి సంతోష్, జామి శివ పాల్గొన్నారు.